
సాక్షి
కుమురం భీం

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



ఆస్వాదిద్దాం రండి
వేసవి సెలవుల్లో విద్యార్థులు విహారయాత్రలకు వెళ్తుంటారు. దూరప్రాంతాలకు వెళ్లలేని వారికి నిర్మల్‌లో చూడాల్సిన ప్రదేశాలెన్నో ఉన్నాయి. 6లో▸



ఆహ్లాదం పొందేదెలా?
గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల్లోని చెట్లు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. గ్రామీణులకు ఆహ్లాదం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా లేదు. 7లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.0 /22.0
పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మళ్లీ మావోల అలజడి..!

పెంచికల్‌పేట్: జిల్లాలో మావోయిస్టుల అలజడి మళ్లీ మొదలైంది. తాజాగా మండలంలోని మురళీగూడ గ్రామపంచాయతీ పరిధి జిల్లెడ గ్రామానికి చెందిన పీజీ విద్యార్థి కోట ఆనంద్‌రావుకు మావోయిస్టు పార్టీతో సంబంధాలున్నాయని పోలీసులు అతడిని అరెస్ట్ చేయడం కలకలం రేపింది. కోట ఆనంద్‌రావుతోపాటు నల్లగొండ జిల్లా మునుగోడు మండలానికి చెందిన చెన్నగోని గణేశ్‌ను పోలీసులు మండలంలోని అగర్‌గూడ గ్రామ సమీపంలో ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. దీంతో మావోల కదలికలు బయటపడ్డాయి. జిల్లాలో ఏడాది కాలంగా రెండు ఘటనల్లో మురళీగూడ గ్రామానికి చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. కాగా, మావోలు ఉనికి చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

9నుంచి సదరం క్యాంపులు

ఆసిఫాబాద్‌అర్బన్: మే 9నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 9న మూగ, చెవిటి, 16వ కంటి చూపు, 23న ఎముకలు, 27న మానసిక వైకల్యం పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పీహెచ్‌సీల్లో ముందుగా వైకల్య పరీక్ష చేయించుకుని స్లాట్‌బుక్ చేసుకున్న తర్వాతే క్యాంపునకు హాజరు కావాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇన్‌చార్జి కార్యదర్శులుగా అవకాశం ఇవ్వాలి



డీఆర్డీవో సురేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న కారోబార్లు

ఆసిఫాబాద్: జిల్లాలోని కారోబార్లకు ఇన్‌చార్జి పంచాయతీ అధికారులుగా అవకాశం కల్పించాలని కోరుతూ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దల వెంకటేశం ఆధ్వర్యంలో కారోబార్లు డీఆర్డీవో సురేందర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉన్నందున తమ సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. ఆయన వెంట కారోబార్లు నాగేశ్, సత్యనారాయణ, విట్టు, రమేశ్ ఉన్నారు.

మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలి



నర్సరీ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: పల్లెప్రకృతి వనాల్లో మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. జైనూర్ మండలంలోని కాసిపేట, మర్కగూడ, బాబుల్‌గూడ, మామడ గ్రామాల్లోని పల్లెప్రకృతి వనాలు, నర్సరీలు, మిషన్ భగీరథ, హెల్త్ వెల్నెస్ సెంటర్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సరీల్లో ఉదయం, సాయంత్రం నీటిని అందించి మొక్కలను సంరక్షించాలని సూచించారు. హరితహారం లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చి శుద్ధజలం సరఫరా చేయాలని తెలిపారు. మన ఊరు-మన బడి కింద మొదటి విడతలో ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులున్నారు.

వరి ధాన్యం అక్రమ రవాణాను అరికట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఓఎస్డీ సుదర్శన్‌రెడ్డి

వాంకిడి: వరి ధాన్యం అక్రమ రవాణాను అరికట్టాలని ఓఎస్డీ టాస్క్‌ఫోర్స్ పౌర సరఫరాలు, సంబంధాల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టులో ఆయన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద ధాన్యం అక్రమ రవాణా కాకుండా చూడాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు

అడవే ఆదెరువు..!



ఇప్పపూలు సేకరిస్తున్న ఆదివాసీలు



సేకరించిన ఇప్పపూలు

ఏళ్లుగా అడవినే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలు సంప్రదాయ అటవీ ఉత్పత్తుల సేకరణను వీడదంలేదు. ప్రస్తుతం గిరిజనమంతా కోడి కూయక ముందే ఇంటిల్లిపాదితో కలిసి అడవిబాట పడుతున్నారు. వేసవి కావడంతో ఇప్పపూల సేకరణలో నిమగ్నమవుతున్నారు. సేకరించిన ఇప్పపూవును జీసీసీతోపాటు మార్కెట్‌లో విక్రయించి కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నారు.

- ఇప్పపూల సేకరణలో 'గిరి'జనం
- కోడి కూయక ముందే అడవిబాట
- కిలోకు రూ.30 చెల్లిస్తున్న జీసీసీ
- వేసవిలో ఆదివాసీలకు ఆర్థిక భరోసా

కెరమెరి(ఆసిఫాబాద్): ఏళ్లుగా గిరిజనం తమ సంప్రదాయ వృత్తిని కొనసాగిస్తున్నారు. సీజన్ వారీగా అటవీ ఉత్పత్తులు సేకరిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. ప్రస్తుత వేసవిలో ఇప్పపూల సేకరణపై దృష్టి సారించారు. కోడి కూయక ముందే ఇంటిల్లిపాది అడవిబాట పడుతున్నారు. ప్రస్తుతం లభించే ఇప్పపూవుతోపాటు ఇతర ఉత్పత్తులు సేకరిస్తున్నారు. జీసీసీతోపాటు మార్కెట్లోనూ విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కెరమెరి, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, వాంకిడి, తిర్యాణి, జన్నారం, దండేపల్లి, బోథ్, ఇచ్చోడ, బేల, బజార్‌హత్నూర్, బెజ్జూర్, సిర్పూర్(టీ) తదితర మండలాలకు చెందిన గిరిజనులు ప్రస్తుతం అటవీ ఉత్పత్తుల సేకరణలో నిమగ్నమయ్యారు. కెరమెరి మండలంలో అధికంగా అడవులు ఉండడంతో సాకడ, సాంగ్వి, కొప్పగూడ, పిట్టగూడ, కెలికె, లెండిగూడ, మెట్టపిప్రి, మోడీ, చాల్‌బడి, జోడేఘాట్, పాట్నాపూర్ తదితర గ్రామాల ఆదివాసీలు తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఇప్పపూల సేకరణలో తలమునకలవుతున్నారు. మరికొద్ది రోజుల్లో తునికాకు సేకరణ కూడా ప్రారంభం కానుండగా అడవే వారికి ఆదెరువవుతోంది.

సేకరణ నుంచి విక్రయం దాకా..



ధనోరాలో ఆరబెట్టిన ఇప్పపూలు

అడవిలో సేకరించిన ఇప్పపూలను గిరిజనులు మొదట ఆరబెడతారు. ఇప్పుడు ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో ఏ ఇంటి ముందు చూసినా ఆరబోసిన ఇప్పపూవే కనిపిస్తోంది. ఆరబెట్టిన తర్వాత కొందరు విక్రయిస్తుండగా.. మరికొందరు వంట చేసుకుని ఆరగిస్తారు. ఎంతో కష్టపడి అడవిలో సేకరించిన ఇప్పపూవుకు మార్కెట్‌లో పెద్దగా డిమాండ్ లేదు. జీసీసీ గతంలో కిలోకు రూ.20 చెల్లించగా గతేడాది నుంచి రూ.30 వరకు చెల్లిస్తోంది. కనీసం రూ.50 చెల్లించాలని గిరిజనులు కోరుతున్నారు.

ధర పెంచితే బాగుండు



ఎండకాలంలో ఆదివాసీలు అడవికి వెళ్లి ఇప్పపూవు సేకరించడం పరిపాటిగా మారింది. సేకరించిన ఇప్పపూవును జీసీసీకి విక్రయిస్తుంటారు. మార్కెట్‌లోనూ పెద్దగా డిమాండ్ లేదు. జీసీసీ కిలోకు రూ.30 చెల్లిస్తోంది. కనీసం రూ.50 చెల్లిస్తే బాగుంటుంది. జీసీసీ అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– కోవ ఇందిర, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కిలోకు రూ.30 చెల్లిస్తున్నాం



వేసవి కావడంతో గిరిజన గ్రామాల ప్రజలు అడివికి వెళ్లి ఇప్పపూవు సేకరిస్తున్నారు. చౌకధరల దుకాణాలకు ఇప్పపూవును విక్రయానికి తీసుకురావాలని సూచించాం. వర్షాల కారణంగా గతం కంటే ఈసారి ఉత్పత్తి తగ్గవచ్చు. ఈసారి కొనుగోళ్లు కూడా తగ్గే అవకాశముంది. ప్రస్తుతం కిలోకు రూ.రూ.30 చెల్లిస్తున్నాం.

– పాపారావు, జీసీసీ మేనేజర్, ఆసిఫాబాద్

వసంతం.. వర్ణనాతీతం..!



వసంత కాలంలో ప్రకృతి అందాలు వర్ణనాతీతం. చింతలమానెపల్లి మండలంలోని డబ్బా గ్రామం నుంచి బెజ్జూర్ అటవీ ప్రాంతం వెళ్తుండగా ఓ సాగుభూమిలో కనిపిస్తున్న ఈ చిత్రం చూపరులకు కనువిందు చేస్తోంది. ఒక చెట్టు ఆకు రాలి.. మరో చెట్టు పచ్చని చిగురు తొడిగి.. ఇంకో చెట్టు ఎర్రటి ఆకులతో ఆకట్టుకుంటున్నాయి.

- చింతలమానెపల్లి

క్రమబద్ధీకరించేదాకా సమ్మె



శిబిరంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

ఆసిఫాబాద్ అర్బన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించే వరకూ నిరవధిక సమ్మె కొనసాగుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు నెరవేర్చాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న సమ్మెలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట 237 మంది జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శుల సేవలు మరువలేనివన్నారు. అయినా ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇచ్చి 317 జీవోతో నష్టపోయినవారికి న్యాయం చేయాలని కోరారు. పరస్పర, స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించి, రాజకీయ వేధింపులను అరికట్టాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు సత్వరమే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

గిరిజన సంక్షేమ కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే సక్కు



క్రిష్టియానాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిష్టియానాను శనివారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయంలో కలిశారు. జీవో 03ను పునరుద్ధరించాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలివ్వాలని కోరారు. గిరివికాసం పథకానికి అధిక నిధులు కేటాయించాలని, ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలకు సీఆర్టీ పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో పూర్తి స్థాయి ఏఎన్‌ఎంలను నియమించాలని కోరారు.

మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని శనివారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. రైతులు కేంద్రాల్లో మక్కలు విక్రయించాలని సూచించారు. వచ్చే నెల 5నుంచి కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, ఏఎంసీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, సహకార సంఘం చైర్మన్ ఉమామహేశ్వర్‌రావు, ఏడీఏ రాజులనాయుడు, వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, నాయకులు మౌల్కార్ లక్ష్మణ్, ధర్ని రాములు, రాజన్న, ఏఈలు, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి'



మాట్లాడుతున్న బండు మేశ్రం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని ఆదివాసీ కేంద్ర కమిటీ సభ్యుడు బండు మేశ్రం పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివాసీ భారత్ మహాసభ, తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభ పెందూర్ రాజేశ్ అధ్యక్షతన నిర్వహించగా మేశ్రం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కవ్వాల్ అభయారణ్యం, హరితహారం పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి తరిమివేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘిస్తూ పోడు భూముల సమస్యలు పరిష్కరించలేకపోయిందని విమర్శించారు. 1.70 చట్టం, పేసా చట్టాన్ని ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయాలని కోరారు. రోజురోజుకూ ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంజేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ రైతులను మోసం చేస్తున్న దళారీ వ్యవస్థను రద్దు చేయాలని, నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహాసభలో ఏబీఎం రాష్ట్ర కో ఆర్డినేటర్ సైదయ్య, జిల్లా కార్యదర్శి తిరుపతి, నాయకులు ప్రియాంక, నగేశ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ భీమ్‌రావు సేవలు అభినందనీయం



భీమ్‌రావును సన్మానిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో అదనపు ఎస్పీ (ఏఆర్)గా విధులు నిర్వహించి కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో డీసీపీగా బదిలీపై వెళ్తున్న భీమ్‌రావును శనివారం ఎస్పీ సురేశ్‌కుమార్ శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గతేడాది జిల్లాకు వచ్చిన భీమ్‌రావు జిల్లాలో సేవలందించారని తెలిపారు. జిల్లాలో ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు, స్పోర్ట్స్ మీట్, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాలు విజయవంతం చేయడంలో భీమ్‌రావు కృషి అభినందనీయమన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన పోలీస్‌శాఖలో ఎంతో ముఖ్యమని, ఈ విషయంలో భీమ్‌రావు ముందుండేవారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, డీసీఆర్బీ సీఐ పవన్‌కుమార్, సీఐలు రాణాప్రతాప్, బుద్దస్వామి, శ్రీనివాస్, నరేందర్, సాధిక్‌పాషా, ఆర్ఐ అడ్మిన్ భరత్ భూషణ్, పోలీస్ యూనియన్ అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, ఆర్ఎస్సైలు ఓదెలు, రాజశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 కేంద్రాలు
- 5,351 మంది విద్యార్థులు హాజరు



ఆసిఫాబాద్‌లోని మోడల్‌స్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్/ఆసిఫాబాద్‌రూరల్: కాగజ్‌నగర్‌లోని త్రిశూల్ పహాడ్‌పై కొనసాగుతున్న కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విద్యాలయంలో 80 సీట్ల భర్తీకి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 5,351 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ చక్రపాణి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరీక్షల నిర్వహణాధికారి ఉదయ్‌బాబు తెలిపారు. 5,920 మంది దరఖాస్తు చేసుకోగా 5,351 (90.34 శాతం) మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,378 మంది దరఖాస్తు చేసుకుని 1,232 మంది హాజరు కాగా 146 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. నిర్మల్‌లో 1,589 మందికి 1,441 మంది హాజరై 148 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మంచిర్యాలలో 1,526 మందికి 1,379 మంది హాజరై 147 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,427 మంది దరఖాస్తు చేయగా 1,299 మంది పరీక్షకు హాజరై 128 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 569 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, విద్యాశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు సహకరించినట్లు పేర్కొన్నారు. మరోవైపు కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్‌లో ఖాళీగా ఉన్న సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారానే భర్తీ చేయడానికి తొలిసారిగా నవోదయ విద్యాలయ సమితి నిర్ణయించినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. గతంలో లాగా పదో తరగతి మార్కుల ఆధారంగా కాకుండా ప్రవేశ పరీక్ష ద్వారా ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందనున్నారని తెలిపారు. పరీక్ష విధి విధానాలు ఉన్నతాధికారులు త్వరలోనే ప్రకటిస్తారని వివరించారు.

'ఎస్టీ హోదా కల్పించేదాకా పోరాడుతాం'



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మాలీలకు ఎస్టీ హోదా కల్పించేదాకా పోరాడుతామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సాలెగూడ గ్రామంలో పూలాజీబాబా ధ్యాన మందిరంలో జరిగిన మాలీల ఆత్మగౌరవ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం అభినందనీయమని, కేంద్రం వెంటనే ఎస్టీ హోదా కల్పించాలని కోరారు. హక్కుల కోసం మాలీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మాలీ సంఘ భవనం కోసం స్థలం కేటాయించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మల్లన్న, విండో చైర్మన్ అలీబిన్, సర్పంచ్ వినోద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు బాలేశ్వర్‌గౌడ్, కేశవరావు తదితరులున్నారు.

న్యాయ సలహా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ రవి

సిర్పూర్(టీ): వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు సిర్పూర్ (టీ) మెజిస్ట్రేట్ రవి సూచించారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో హైకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు న్యాయ సలహా కేంద్రాల ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కేంద్రాల్లో వ్యవసాయ, న్యాయశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ప్రతీ శనివారం కోర్టు ఆవరణలో కోర్టు అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, ఏడీఏ మనోహర్, ఏడీఏ రాజులనాయుడు, వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఆర్బీఎస్ కోఆర్డినేటర్ చౌదరి నానాజీ, ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, తుకారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, న్యాయవాదులు గణపతి, కళ్యాణ్, ఏవో మధులత, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

లావాదేవీల నమోదుకు యాప్



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న భారతి

ఆసిఫాబాద్‌రూరల్: మహిళా సంఘాల లావాదేవీలను సులభతరం చేసేందుకు ప్రభుత్వం లోకోస్ యాప్ తీసుకువచ్చినట్లు లోకోస్ ట్రైనర్ భారతి తెలిపారు. శనివారం మండలంలోని జెండగూడ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే నుంచి మహిళా సంఘాల పూర్తి వివరాలు యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుందని తెలిపారు. పారదర్శకత, వేగవంతమైన పనికి సాంకేతికతను జోడించి యాప్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల నుంచి మహిళా సంఘాల వివరాలు యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. మహిళా సంఘం ఏపీఎం, సీసీలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పులిదాడిలో గాయపడిన ఆవు మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడలో తలండి నారాయణకు చెందిన ఆవుపై శుక్రవారం పులి దాడిచేయడంతో తీవ్రగాయాలయ్యాయి. శనివారం ఆవు మృతి చెందడంతో అటవీశాఖ అధికారులు పంచనామా నిర్వహించారు. బాధిత రైతుకు పరిహారం అందిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి వృద్ధుడు మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కిందపడి వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. స్థానిక శ్రీశ్రీనగర్‌లోని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం (ఆనందనిలయం)లో నస్పూర్ మండలంలోని సీతారాంపల్లెకు చెందిన దామరకొండ బీరయ్య(70) కొంతకాలంగా అనాధగా ఉంటున్నాడు. శనివారం తన బట్టలు ఆరేసెందుకు బిల్డింగ్ పైకి వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ విత్తనాలు పట్టివేత

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండలంలోని టీకులపల్లి స్టేజీ వద్ద శనివారం పోలీసులు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన సాంబశివారెడ్డి, అలియాస్ శివయ్య, డ్రైవర్ శ్రీకాంత్‌గౌడ్ మ్యాజిక్ పికప్ వెహికిల్‌లో సుమారు 8 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు కన్నెపల్లి మండలానికి తరలిస్తుండగా కన్నెపల్లి పోలీసులు పట్టుకున్నారు. వాటి విలువ సుమారు రూ.15 లక్షలకుపైగా ఉంటుందని వ్యవసాయాధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

మేడే ఘనంగా జరుపుకోవాలి

బెల్లంపల్లి: మేడేను ఘనంగా జరుపుకోవాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి.చాంద్ పాషా అన్నారు. శనివారం బెల్లంపల్లిలోని సివిక్ కార్యాలయం ఆవరణలో మేడే వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు కాల రాస్తున్నారని, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయని అన్నారు. పోరాటాలతోనే కార్మికులు హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ శ్రేణులు భాను, సునీత, సురేష్, పోసక్క, చంద్రకళ, అమృత, వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, కమల, దేవమ్మ పాల్గొన్నారు.

టీఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో..

సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్(టీఎస్టీయూసీ) ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నాయకులు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. టీఎస్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ టి.మణిరాంసింగ్, నాయకులు మల్లయ్య, హసన్, తిరుపతి, హరికిషన్‌పాండే, జీవరత్నం, గంగాధర్‌గౌడ్, రవి పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నస్పూర్: నస్పూర్ పట్టణంలో సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేసి మే నెలలో ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. శనివారం ఆయన కలెక్టర్ భవన నిర్మాణ పనులను రోడ్లు భవనాల శాఖ ఈఈ రాముతో కలిసి తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు అన్నింటినీ ప్రజలకు ఒకే చోట అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సమీకృత కలక్టరేట్ భవన నిర్మాణాలు చేపట్టిందని వివరించారు. భవనం ఆ వరణలో ఆహ్లాదం కోసం చెట్లు పెంచాలని అ న్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

చారిత్రాత్మక భత్తీస్‌గఢ్ కోట



గండి రామన్న హరితవనం



భత్తీస్‌గఢ్ కోటపై ఉన్న ప్రహరీ



ఆస్వాదిద్దాం రండి...



విద్యుత్ కాంతుల్లో శ్యాంఘఢ్ కోట

సండే స్పెషల్

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులకు సెలవుల కాలం.. పదోతరగతి, ఇంటర్, తదితర పరీక్షలన్నీ పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులంతా విహారయాత్రలకు వెళ్లేందుకు, ప్రకృతిఒడిలో సేద తీరేందుకు ఇదే సరైన సమయం. ఇందుకోసం వ్యయప్రయాసలకోర్చి వెళ్లలేనివారికి ఇక్కడే మన చెంతనే జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఆహ్లాదం పొందేందుకు, వీక్షించేందుకు ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపే సహ్యాద్రి పర్వత శ్రేణులలోని మహబూబ్ ఘాట్స్.. స్వర్ణనది గోదావరిలో కలిసే సోన్ సంగమ ప్రదేశం, పార్కులు.. వెరసి చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. వీటికితోడు చారిత్రక ప్రదేశాలు శ్యాంఘఢ్, బత్తీస్‌ఘఢ్, నిర్మల్ కోటలు ఇక్కడే ఉన్నాయి. వీటిపై 'సాక్షి' కథనం.

- వేసవి కాలక్షేపం మన చెంతనే
- సేదతీరే ఆహ్లాదం ఇక్కడే..
- చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో..
- చారిత్రక నేపథ్యం కూడా...
- దూరభారం, వ్యయప్రయాసల్లేవ్..

ఓ లుక్కేద్దాం...రండి...

ప్రకృతితో మమేకమయ్యేందుకు నిర్మల్ సమీపంలోగల గండిరామన్న హరితవనం ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరుగా నిలుస్తోంది. జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ హరితవనం ఉండగా నిత్యం వందలాది మంది ప్రజలు ఈ పార్క్‌ను సందర్శిస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో పట్టణ ప్రజలే కాక ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే అనేక మంది ఇక్కడ ఆగి సేద దీరుతారు. ఉదయం వాకర్స్, సీనియర్ సిటిజన్స్‌కు అనువుగా పలు ప్రదేశాలు ఉన్నాయి. వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల పార్క్, వాచ్‌టవర్, క్యానోపివాక్ సౌకర్యం కలదు. తెల్లవారుజామున వందలాది సంఖ్యలో దర్శనం ఇచ్చే నెమళ్లు, పలు రకాల పక్షుల కిలకిలరావాలతో మనస్సుకు ఒకింత ఆహ్లాదం కలుగుతుంది. ఏపుగా పెరిగిన చెట్ల మధ్యలో నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంపులపై సందర్శకులు నడుస్తున్నప్పుడు చక్కటి అనుభూతి పొందుతారు. కోతులు, జింకలకు ఇక్కడ సంరక్షణ కేంద్రాలున్నాయి. అటవీశాఖ అధికారులు ప్రవేశ రుసుముతో పాటు సఫారి వాహన సౌకర్యం కల్పించారు. సందర్శకులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

మరింత అభివృద్ధి జరగాలి



నిర్మల్ చుట్టుపక్కల ప్రాంతాల్లోగల పర్యాటక ప్రదేశాల్లో వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. టూరిజం శాఖ మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు కాకముందే వాటిని సంరక్షించుకుంటే భావితరాలకు పురాతన చరిత్రను అందించే అవకాశం ఉంటుంది.

– గందం రత్నాకర్, నిర్మల్

వసతులు మెరుగుపర్చాలి



నిర్మల్‌కు చారిత్రాత్మకంగా మంచి గుర్తింపు తేవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి కోటలు, కందకాలు, బురుజులు నాటి పరిపాలనా కాలాన్ని తెలుపుతాయి. వసతులు మెరుగుపరిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

– ధోండి శ్రీనివాస్, నిర్మల్

చారిత్రక కోటలెన్నో...



ఖిల్లాగుట్ట

నిర్మల్ పట్టణం శివారులో గొలుసుకట్టు చెరువులతో పాటు ఆనాటి పాలకుడైన నిమ్మలనాయుడు పట్టణం చుట్టూ ప్రధానమైన రక్షణగోడ నిర్మించాడు. చెరువులను అనుసంధానం చేస్తూ కందకాలు నిర్మించాడు. నాటి ఆనవాళ్లను చూపే బత్తీస్‌ఘఢ్, శ్యాంఘఢ్, ఖిల్లా గుట్ట, (రాజసౌధం) తదితర చూడదగిన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

వందేళ్ల చరిత్ర కలిగిన సోన్ వంతెన



ప్రాచీన కాలంనాటి సోన్ వంతెన

నిర్మల్–నిజామాబాద్ జిల్లాలను కలిపే సోన్ గోదావరి నదిపైన నిజాం కాలంలో వందేళ్ల క్రితం నిర్మించిన పొడవైన వంతెన ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. నూతనంగా నిర్మించిన వంతెన ఉన్నప్పటికీ పురాతన వంతెన చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది.

సహజత్వం ఉట్టిపడేలా కొయ్యబొమ్మలు



కొయ్యబొమ్మల తయారీలో కళాకారులు

నిర్మల్ పేరు వినగానే కొయ్యబొమ్మలు గుర్తొస్తాయి. సహజత్వం ఉట్టిపడేలా ఇక్కడి కళాకారులు పొనికి కర్రతో తయారు చేసే కొయ్య బొమ్మల్లో ఆకర్షించే గుణం ఉంది. శిల్పకళ, చిత్రకళలో ఆరితేరిన నిపుణులకు నిర్మల్ నెలువుగా ఉంది. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన నిర్మల్ పెయింటింగ్స్‌కు, కొయ్యబొమ్మలకు నిలయంగా ప్రపంచ ప్రసిద్ధి గాంచింది.

ప్రకృతి రమణీయత...



గండిరామన్న హరితవనం

నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డు నుంచి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో ప్రకృతిని అస్వాదించేలా దట్టమైన అడవులు, వంపుతిరిగిన రోడ్లు మనస్సుకు ఆహ్లాదాన్ని అందిస్తాయి. కొరటికల్, మొండిగుట్ట, బూర్గుపెల్లి, తాండ్ర, తదితర గ్రామాలు ఈ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్నాయి. పచ్చదనం పరుచుకుని ఉన్న ప్రకృతిఒడిలో సేద తీరటానికి అనువైన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

మ్యారేజ్ బ్యూరోల జిల్లా కమిటీ ఎన్నిక

మందమర్రిరూరల్(చెన్నూర్): మంచిర్యాల జిల్లా మ్యారేజ్ బ్యూరోల మీడియేటర్స్ ఆత్మగౌరవ గుర్తింపు సాధన జాయింట్ యాక్షన్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నగునూరి లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులుగా సుమోహన్, భూమయ్య, చీఫ్ అడ్వయిజర్‌గా నల్ల రవీందర్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జిగా పంజా సమ్మయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జంపాల తిరుమలేశ్, ఉపాధ్యక్షులుగా బొంగోని వెంకటస్వామిగౌడ్, డేగ శ్రీనివాస్, సీహెచ్ ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గోమాస బ్రహ్మానందం, కార్యదర్శులుగా గణపతి, ఖాజామొహినొద్దీన్, సహాయ కార్యదర్శులుగా కందుకూరి నర్సయ్య, కొండ రాజలింగు, అధికార ప్రతినిధిగా బోగ చంద్రమౌళి, ప్రచార కార్యదర్శిగా సుశీల, వెంకటనర్సయ్య, చాట్లపల్లి రాజేశ్, కోశాధికారిగా గట్ల దయాకర్, కార్యవర్గ సభ్యులుగా కారుకూరి శ్రీనివాస్, గణేశ్‌సింగ్, రమేశ్, గజ్జెల మల్లేశ్, పెంబర్తి మొగిలి, మధుకర్, రాజయ్య ఎన్నికయ్యారు.

మార్లావాయిని సందర్శించిన కేయూ ప్రొఫెసర్



నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ఈసం నారాయణ

నార్నూర్(జైనూర్): జైనూర్ మండలంలోని మార్లావాయి గ్రామాన్ని శనివారం కాకతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు సందర్శించారు. హైమన్‌డార్ఫ్, ఎలిజిబెత్ దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు ఇంటికి వెళ్లి ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాల వ్యవహారాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ జుగ్నాక సావిత్రి ధర్మేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మెలో సైతం రక్తదానం

వేమనపల్లి(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా), రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజ్‌కుమార్ శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నిరవధిక సమ్మెలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు సిరాజ్, సుదర్శన్ శిబిరానికి వెళ్లి రక్తదానం చేశారు. సుమారు 34 మంది దాతలు రక్తదానం చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, డీటీ సంతోష్, ఆర్‌ఐ లక్ష్మణ్, జూనియర్ అసిస్టెంట్ దేవేందర్, రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా సాగింది. జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 1526 మంది విద్యార్థులకు గాను 1379 మంది హాజరుకాగా 147 మంది గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు ఎంజేపీ ఆర్‌జేసీ, ఆర్‌డీసీ సెట్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రం మంచిర్యాలలో మహాత్మా జ్యోతిబా పూలే(ఎంజేపీ) తెలంగాణ బీసీ వెల్ఫేర్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఆర్‌జేసీ, ఆర్‌డీసీ సెట్ ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశామని మహాత్మా జ్యోతిబా పూలే విద్యాసంస్థల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జెడ్పీ బాలురు, బాలికల పాఠశాల, మిమ్స్ చైతన్య, కృష్ణవేణి, ట్రినిటి, కార్మెల్‌హైస్కూల్, ఉషోదయ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1572 మంది విద్యార్థులు జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి, 252 మంది డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ డిపో స్థలాన్ని పరిశీలించిన డీఎం

చెన్నూర్: చెన్నూర్ పట్టణ సమీపంలోని గెర్రె కాలనీలో ఆర్టీసీ బస్ డిపో కోసం కేటాయించిన స్థలాన్ని ఆర్టీసీ అధికారులు శనివారం పరిశీలించారు. త్వరలోనే ఆర్టీసీ డిపో నిర్మాణం ప్రారంభించేందుకు ఆర్టీసీ సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్థలాన్ని పరిశీలించారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఆంజనేయులు, ఏఈ మల్లారెడ్డి, ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్, విజిలెన్స్ అధికారి సురేందర్‌రావు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన గొర్రెలు ఎంపిక చేసుకోవాలి

జైపూర్: ఆరోగ్యవంతమైన గొర్రెలు ఎంపిక చేసుకోవాలని, 18నెలల నుంచి 24నెలల గొర్రెలనే కొనుగోలు చేసుకోవాలని పశుసంవర్ధశాఖ జేడీ వై.రమేశ్ తెలిపారు. జైపూర్ మండల వ్యాప్తంగా 20గ్రామ పంచాయతీలకు చెందిన 12సొసైటీల సభ్యులకు శనివారం స్థానిక రైతుల వేదికలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఏడీ శంకర్‌తో కలిసి జేడీ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కడపలో గొర్రెల కొనుగోళ్లకు అవకాశం కల్పించారని తెలిపారు. మండల వ్యాప్తంగా రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి 330మందిని ఎంపిక చేయగా 130మంది డీడీలు తీశారని మిగతా 200మంది త్వరగా డీడీలు తీస్తే అందరికీ ఒకే దఫాలో గొర్రెలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సతీశ్ పాల్గొన్నారు.

లేడీస్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం



కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ల సతీమణులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్‌లోని ఇల్లెందు క్లబ్‌లో శనివారం లేడీస్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్, ఎస్టీపీపీలోని లేడీస్ క్లబ్ సంయుక్తంగా ఈ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణ సతీమణి హరిణి, డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీనివాస్ సతీమణి కళ్యాణి, డైరెక్టర్ (పీపీ)జీ.వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిణి సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో కొత్త సంబంధాలు ఏర్పడుతాయన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, క్లబ్ సభ్యులు డాలి నూర్, స్వరూప, స్వరాజ్యం, యశోద పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సీవోఈ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ రెండో సెషన్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఈ నెల 6నుంచి 15వరకు పరీక్షలు జరుగగా శనివారం ఫలితాలు వెలువడ్డాయి. 32మంది జేఈఈ పరీక్ష రాయగా వీరిలో 18మంది ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. అడ్వాన్స్‌డ్ పరీక్షలు అర్హత సాధించిన వారికి దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో ప్రవేశం కల్పిస్తారు. సిలివేరు వినయ్ 81.37 పర్సంటైల్‌తో కళాశాల టాపర్‌గా నిలువగా, ముంజం అంజన్న 74.98, ఎనగందుల మౌర్య 74.47, వైరగడే రాహుల్ కుమార్ 74.30, చునార్కార్ అఖిలేశ్వర్ 71.31 పర్సంటైల్ సాధించారు. ఎస్టీ విభాగంలో తేజావత్ సిద్ధు 7008 జాతీయ ర్యాంకుతో మొదటి స్థానాన్ని దక్కించుకోగా మరో విద్యార్థి పి.విశాల్ 1109 ర్యాంకు సాధించాడు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, అధ్యాపకులు అభినందించారు. అధ్యాపకులు నాగినేని శ్రీరామవర్మ, మిట్టా రమేష్, చందా లక్ష్మీనారాయణ, సుంకరి అర్జున్, కట్ల రవీందర్, సురేష్‌గౌడ్, సిబ్బంది సమేందర్, తేజస్వీ, రాజశేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

భీమారం విద్యార్థికి 12వ ర్యాంకు



జేఈఈ మెయిన్స్‌లో 12వ ర్యాంకు సాధించిన రాకేష్

భీమారం: మండల కేంద్రానికి చెందిన పల్ల రాకేష్ జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 12వ ర్యాంకు సాధించాడు. 1 నుంచి 7వ తరగతి వరకు భీమారంలోని గీత ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో, 10వ తరగతి నుంచి ఇంటర్ వరకు కరీంనగర్ అల్ఫోర్స్‌లో చదివాడు. రాకేష్ తండ్రి లక్ష్మీనారాయణ ఆటో నడుపుతూ చదివించాడు.